హంతకుడు నాగరికత...
హతుడు మానవత్వం...
సాక్షులు మన అంతరంగాలు...
రావేం - ఎప్పుడూ
నిజం న్యాయస్థానాలకి?...

* * *

చలికాలపు నిశిరాత్రి. అన్నీ అమరిన అదృష్టవంతులకు అది మత్తురాత్రి. అన్నింటికీ ప్రకృతి దయాధర్మాలపై ఆధారపడిన వారికది చరమరాత్రి. నాగరికత వేడికౌగిళ్ళలో సుఖం అనుభవిస్తున్న వెన్నెల రాత్రి అది. కరకు చలి ఉక్కు



# ఒక మహారాత్రి

కౌగిలిలో మానవత్వపుటెముకలు పొట్లిపోతున్న చలిరాత్రి వెన్నెల అది.

ఆ మహానగరానికి దూరంగా – ఏకాంతంగా, గర్వంగా నిలిచిన ఆ మూడంతస్తుల భవంతిలో చివరి అంతస్తులో దీపం వెలుగుతోంది. బయట ప్రకృతి అంతా చలికి ఘనీభవించి స్తంభించిపోయివుంది. కానీ ఆ గదిలో మాత్రం కోరికల వేడి. మేడ చుట్టూ ఉన్న తోట అంతా మంచు దుప్పటిలో మునిగిపోయిఉంది. పిచ్చిగా పూసిన పూలు మాత్రం తమ విధి నిర్వహిస్తున్నాయి – వాసనలు విరజిమ్ముతూ. ఆ సుమ సుగంధాన్ని ఆఘ్రాణించడానికి అక్కడ ఎవరూ లేరు. కానీ మూడవ అంతస్తులోని ఆ గదిలో మాత్రం యువదంపతులు వేడి ఊపిరితో వున్నారు. మూసిఉన్న గది కిటికీ గాజుతలుపు కొద్దిగా తెరిచి, ఆ యువకుడు బయటకు చూసాడు. చలిగాలి తరక అతడి చెక్కిళ్ళను సుతారంగా తాకి 'జివ్'మనిపించింది.

"ఇవాళ మంచు బాగాపడుతోంది. రా! చూడు – వెన్నెలచీర కట్టుకొన్న ప్రకృతి కాంత మంచు పరదాలో ఎన్ని హొయలు వెలార్చుతున్నదో? ఎంత ముగ్ధ మనోహరంగా ఉందో! ప్రకృతి పురుషుడు రతి పారవశ్యంతో ఏకమైనట్లు... అంతా స్తబ్ధత"

ఆ యువకుడు ప్రకృతి అందాన్ని తనివి తీరా చూసి, భార్య హేమతో అన్నాడు. ఆమె నైట్‌గౌన్ సరిచేసుకుంటూ వచ్చింది. కిటికీ దగ్గరకు వెళ్ళింది.

అతడు భావుకుడు, యువకుడు, కొత్తగా పెళ్లయిన వాడు, ప్రక్కన జవరాలు ఉన్నవాడు. ఏకాంత నిశీధం. ఎవరి బెడదాలేని ఒంటరి జంట వాళ్ళిద్దరూ.

ఆమె వినీల కేశపాశం చిందర వందరగా వుంది. చిరుగాలికి తల విరబోసుకొన్న వర్జిన్ ఫెరస్ ఆమె. అవును... స్త్రీకి, వనదేవతకూ అందుకే అంత సారూప్యం. ఆమె వచ్చి కిటికీ దగ్గర నిలబడిఉంది. ఆమె వెనుక వచ్చి అతను నిలబడ్డాడు.

"ఏమీ మాట్లాడవేం? ఈ ప్రకృతి... ఈ ఏకాంతం నీకు నచ్చలేదా?" అతను ప్రశ్నించాడు. ఆమె విశాల నయనాలను రెపరెపలాడించింది. అతని భుజాలమీద వాలుతూ, "క్రిందకు వెళ్ళి తోటలో కూర్చుందామా?" అని అడిగింది తోటలోకే తదేకంగా చూస్తూ. ఆ చెట్లమధ్య ఆ మంచు తెరలలో ఆ పూల వాసనల మధ్య పరవశించాలని ఆమె కోరిక. కానీ అందుకు ఆమె శరీరం సహకరించదు.

"ఆ మంచు నీకు పడదు. ఇక్కడే ఉందాం. మళ్ళీ అనారోగ్యం చేస్తే ఇబ్బంది పడాలి". అతను ఆమె వెన్నుమీద సుతారంగా రాస్తూ అన్నాడు. ఆమె మౌనంగా తోటలోకే చూడసాగింది.

ఇంతవరకూ కిటికీలోనుంచి ప్రకృతిని చూస్తున్నది ఆ గదిలోని ఒక్క దీపపు నేత్రమే...

పురాణపండ రంగనాథ్

కానీ ఇప్పుడు రెండు జతల నయన దీపికలు ఆ ప్రకృతిని చూస్తున్నాయి.

వారి దృష్టిని ఆకర్షిస్తూ తోటలో ఒక ఆకారం. వెన్నెల కావడం వలన ఆ ఆకారం అస్థి పంజరంవలె ఉన్నట్లు కనిపించింది. కదులుతున్న ఆ కంకాళాన్ని చూసి హేమ 'దయ్యమేమో'నని భయపడింది. కానీ అంతలోనే తమాయించుకుని "పాపం... ఎవరో బాటసారిలా వున్నాడు. చలికి తాళలేక ఇటు వచ్చాడు. అతడి శరీరం చూసారా? ఎముకలకు చర్మం అతికించినట్లు ఎంత శుష్కించిందో" అంది ఆమె.

"అది సరే కానీ... ముందు ఆ దీపం తీసెయ్యి. మనం ఇక్కడ ఉన్నామని తెలిస్తే పాపం... భయపడి వెళ్ళిపోవచ్చు. తమ దైన్యాన్ని చూసి ఎదుటివాళ్ళు పరిహసించరాదని అనుకొంటారు కొందరు పేదవాళ్ళు". అతని మాటలు పూర్తి కాకుండానే ఆమె దీపం ఆర్పేసింది. ఇప్పుడు ఆ గదిలోని వారు బయటి వాళ్ళకు కనిపించరు. కానీ బయటి ప్రకృతి పూర్తిగా, స్పష్టంగా వారికి కనిపిస్తోంది.

కొంతసేపయ్యాక అతను ఆ గదిలో ప్రత్యేకంగా అమర్చిన అలమరా దగ్గరకు అలవాటు చొప్పున నడిచివెళ్ళాడు. విదేశీ మద్యంసీసా తీసుకొని గ్లాసులో పోసుకున్నాడు. ఆ సమయంలో ఆ యువకునికి అది నూతన జవసత్వాలు యిస్తుంది. ఆమె మాత్రం కిటికీ దగ్గర నిలబడి ఆ సజీవ మానవ కంకాళాన్ని చూస్తూనే వుంది.

ఎవరో ఆ బీదవాడు... వరండా మీదకు చేరి మూలన నక్కి, ముడుచుకొని పడుకొన్నాడు. చలికి అతని దవడలు గజగజలాడుతున్నాయి. అతను వుండ చుట్టుకుపోతున్నాడు.

"రా! డియర్, ఈ చలి భరించలేం. కిటికీ వేసేసిరా! ఇదిగో డ్రింకిట్" అంటూ యువకుడు భార్యకు విస్కీ గ్లాసు అందించాడు. గ్లాసు అందుకుని త్రాగబోయి, ఆమె కిటికీలోంచి కిందకు చూసింది.

చిరిగిన గుడ్డలతో, శుష్కించిన శరీరంతో, రేగిన జుట్టుతో ఉన్న ఆ పేదవాడి శరీరంలోని ప్రతి కణంతోనూ చలికోతి చేస్తున్న అల్లరిని ఆమె చూసింది. అతడి దయనీయ స్థితి ఆమె అంతరాంతరాలలో నిద్రపోయిన మానవత్వాన్ని తట్టిలేపింది.

"ఏమండీ... ఈ గదిలో ఉంటేనే మనకింత చలివేస్తోందే... పాపం... ఆ పేదవాడు ఎలా గజగజలాడుతున్నాడో చూడండి" ఆమె మాట్లాడలేకపోయింది. అతనికి ఏమైనా సహాయం చేయాలనే ఆమె భావన యువకునికి అర్థం అయ్యింది. ఆ సమయంలో ఆ పేదవాడికి కావలసింది వెచ్చదనం.

అతడ్ని లోపలికి తీసుకువస్తే సమస్య పరిష్కారం అయిపోతుంది. కానీ... అమ్మో... ఆ పాలరాతి మెట్లు, ఆ మొజాయిక్ ఫ్లోర్, ఆ ముఖమల్ తక్కులు, ఆ భవనం మెయిన్‌హాలులో రెప్పవాల్చకుండా తమ గౌరవాన్ని కాపాడుకొంటున్న జమీందారుల తైలవర్ణచిత్రాలు, ఆ నియాన్ బల్బులు... ఆ మానవ కంకాళాన్ని చూసి భయపడి చచ్చిపోవూ? అందుచేత అతడ్ని లోనికి పిలిచే ప్రసక్తిలేదు. అదీకాక పేదవాడు కదా అని కనికరించి ఆదుకున్నా కష్టమే. ఆకలి తీరగానే వాళ్ళకు అజీర్ణం పెరిగి, అన్నీ కావాలని ఏవైనా ఎత్తుకుపోతారు. అంచేత వాళ్ళ గురించి సానుభూతి పెదాలమీద మెత్తగా తిరుగుతుండాలే తప్ప అది కార్యరూపం ధరిస్తే ఫలితం అనూహ్యంకాదు కానీ... అంత భరిం




చేదిగా వుండదు. ఇది యువకుని ఆలోచన.

కానీ... తన భార్య... తన ప్రియ సఖి... అంతగా జాలిపడుతున్నప్పుడు ఆమె మెప్పుకోసం లేదా తృప్తికోసం తనూ జాలి నటించాలి. లేకపోతే ఇంత 'మృదువు' గా ఉన్న తన శరీరం లోని హృదయం అంత 'కఠిన పాషాణమా' అని అనుకొంటుందేమో? అనే ఆలోచనతో యువకుడు "డియర్, డ్రింకిట్. నేను క్రిందకు వెళ్ళి అతడిని చూసి వస్తాను" అని వెళ్ళిపోయాడు మెట్లు దిగి. అంతవరకూ చేతిలో వున్న విస్కీగ్లాసుని ఆమె నోటికందించింది. నెమ్మదిగా సిప్‌చేస్తూ క్రిందకు చూడసాగింది.

యువకుడు సరాసరి క్రిందకు వెళ్ళాడు. అతడిని చూడగానే మానవ కంకాళం బెదిరిపోయి లేవాలని విఫలయత్నం చేసి, వినమ్రవందనం చేసింది.

"ప్రొద్దుటే నాదార్న పోతా బాబూ కనికరించండి" అని ఆ పేదవాడు ప్రాధేయపడి ఉంటాడని మేడమీది హేమ ఊహించింది. ఇంతలోనే యువకుడు చకచకా పైకి వచ్చాడు. బట్టల అలమారా తెరిచాడు. అందులో రకరకాల దుప్పట్లు, శాలువలు, విలువైన ఉన్ని బట్టలు, అన్నీ ఖరీదైనవే, అన్నీ కొత్తవే, అన్నీవారివే, ముట్టుకుంటే కందిపోతాయన్నంత సున్నితంగా ఉన్నాయి. అందులో ఒక దుప్పటి చాలు పేదవాడి చలిని తరిమివేయడానికి. కానీ యువకుడు అలమారా తలుపును మూసేసాడు. మంచం వైపుచూసాడు. ఆ రోజు సాయంత్రం వేసిన దుప్పట్లే మంచంమీదవి.

"డియర్... ఇక్కడ అన్నీ కొత్త బట్టలే" అన్నాడు అవి ఇవ్వడం ఇష్టం లేని అతను. అవును మరి... కొంచెం చిరిగితేనో, మాసితేనో గానీ పేదవాడికి బట్టలు ఇవ్వకూడదనే అందమైన సంస్కారాన్ని అతని 15 సంవత్సరాల విద్య నేర్పింది. అంతేకానీ ఐశ్వర్య లక్ష్ములు ఎనిమిది

మంది వూడిగం చేస్తున్న నిండు సభలో తన దగ్గరకు వచ్చిన పేదమిత్రుడు సుదామునకు ఆదరపూర్వకమైన కౌగిలింతతో స్వాగతం పలికి, పీతాంబరాలకు, కుచేలాలకూ పొత్తు కలిపిన శ్రీకృష్ణుని వారసత్వం ఈ దేశానిది - అని ఆ యువకునికి తెలియదు. తెలిసినా అది పుక్కిటి పురాణం, అభూతకల్పన అని చీపురుపుల్లను తుంచినట్లు కొట్టిపారేయగల ఆధునిక పాశ్చాత్య భావ విద్యార్థి అతను. ఆచరణలేని ఆదర్శ వాది అతను.

ఆ ఖరీదైన బట్టలు ఆ పేదవాడికి యివ్వడం ఆమెకూ ఇష్టంలేదు. కానీ ఒక వంక నిండు ప్రాణం చలిలో కొట్టుమిట్టాడుతుండడం ఆమె సుతరామూ సహించలేకపోతోంది.

"మీరు చేయలేని సాయం నేను చేస్తాను" అంటూ ఆమె చకచకా డైనింగ్ హాలులోకి వెళ్ళింది. అక్కడ మేజా మీద తినగా మిగిలిన పదార్థాలు ఏమీలేవు. ఫ్రిజ్‌లో మాత్రం బ్రతికిన శవాలు భద్రంగా వున్నాయి. పళ్ళు, పళ్ళరసాలు, బట్టర్, బన్, జామ్,... ఒకటేమిటి అవీ, ఇవీ, అన్నీ మనిషి ఆకలిని తీర్చాలని 'ఆవురావురు' మంటున్నాయి. వాటిలో నాలుగు పళ్ళు చాలు... ఆ పేదవాడి ఆకలి తీర్చడానికి, అతడిలో వేడిని కలిగించడానికి.



గుంటూరు పుస్తకమహోత్సవం సందర్భంగా అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సభలో ప్రముఖకవి శ్రీ సోమేపల్లి వెంకటసుబ్బయ్య ఐదవ కవితా సంపుటి 'తదేకగీతం' ఆవిష్కరిస్తున్న కవయిత్రి శ్రీమతి ఎన్. అరుణ. చిత్రంలో శ్రీయుతులు ఆచార్య ఎన్. గోపి, పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, సోమేపల్లి వెంకటసుబ్బయ్య వున్నారు.

కానీ ఆ పదార్థాలు ఖరీదైన మనుషుల చేతులలోని ఫోర్క్‌లకే కానీ నంజుడు పడవు. వాటికి స్పూను మూతులంటేనే ఇష్టం. కాని పేదవాడి ఎండు పెదాలంటే కసి. ఆమె నిస్సహాయంగా ఫ్రిజ్ మూసేసింది. అటూ ఇటూ చూసింది. భర్తవలెనే తనూ ఓడిపోయింది. అవును మరి...

తినగా మిగిలిన ఎంగిలి మెతుకులనో, పాచిపోయిన పదార్థాలనో పేదవాళ్ళకు విసిరివేసే సంపన్న సంస్కారం ఆమెది. అంతే. కాని...

తను తినాలనుకొన్న రొట్టెని నోటకరచుకుపోయిన కుక్కపై కోపగించక, దాని వెంట నేతి గిన్నెతో పరుగెత్తిన కబీరు వంటి మానవతావాదులు, చండాలుని దప్పిక తీర్చిన రంతిదేవుని వంటి చక్రవర్తులూ ఈ గడ్డపై జీవించారన్న స్ఫురణ ఆమెకు లేదు. ఒక వేళ ఉన్నా 'వాళ్ళు ఛాందసులు' అనగల ఆధునిక యువతి ఆమె. అయినా విశ్వ సౌభ్రాతృత్వ సిద్ధాంతాన్ని వల్లించగల దిట్ట ఆమె.

"ఏం చేద్దామండీ... అతనికి పెట్టదగ్గ పదార్థాలే లేవు." అమె విచారంగా అతని గుండెలకు చేరువైంది.

"డబ్బులేమైనా ఇవ్వు..." అతను గ్లాసులోనికి విస్కీ ఒంపుకొంటూ అన్నాడు. ఆమె అతని పాంటు జేబులు, చొక్కా జేబులు, పర్సూ వెదికింది చిల్లర కోసం. కానీ చిల్లర లేదు. ఇనప్పెట్టె తెరిచింది.

ఆకు పచ్చరంగు అయిదు కాగితాలు, వూదా రంగు ఇరవైలు, నీలి తారల వంటి వందనోట్లు తప్ప ఆ పెట్టెలో పేదవాడికి ఇవ్వడానికి రూపాయి నోటు లేదు. ఆ మానవ కంకాళం చేతిలోనికి వెళ్ళి చలిలో నలిగిపోమని ఆ పెద్ద కాగితాలు కూడా భీష్మించాయి. ఆమె ఇనప్పెట్టె మూసేసింది. "చిల్లర లేదండీ..." అంది బేలగా. అతడు బిగ్గరగా నవ్వాడు.

మానవత్వాన్ని మెటీరియల్ సివిలిజేషన్ ఎంతగా అధఃకరించిందో ఆ నవ్వు నిర్వచించింది. కానీ ఆమెకు అర్థంకాలేదు, యువకుడు నవ్వుతూనే ఉన్నాడు. మితిమీరి త్రాగిన అతనిని నెమ్మదిగా తీసుకువెళ్ళి మంచం మీద పడుకోబెట్టింది. కిటికీ తలుపులు వేయబోయి ఒక్కసారి వరండాలో గిజగిజలాడుతున్న ఎముకల పోగు శరీరాన్ని జాలిగా చూసింది.

చుట్టూ నిర్మించుకొన్న అంతస్తుల గోడల మధ్య నాగరికం ఎదలో చోటులేని మానవత్వాన్ని నిస్సహాయ స్థితిలో బయట వదిలేసి, కిటికీ తలుపులు వేసి వచ్చి ఆమె భర్త పక్కనే పడుకుంది. ఇద్దరికీ సరిపడా విదేశీ ఉన్ని దుప్పటి కప్పేసింది.

బిగి కౌగిలి వేడిలో నాగరికత...
చలి రాక్షసి ఒడిలో మానవత్వం...

ఆ రాత్రి అలాగే గడిచింది. తెల్లవారింది. విదేశీ ఉన్ని దుప్పటి వెచ్చదనంలో ఆదమరిచి నిద్రపోతున్న అధునాతన నాగరికతను లేపాలని, లేపి వరండాపై కంకాళంలో దీర్ఘనిద్రపోయిన మానవత్వానికి దహన సంస్కారాలకు ఏర్పాటు చేయించమని చెప్పాలనీ భవనం తలుపులను ఎండ చేతులతో సూర్యుడు తడుతున్నాడు.

* * *

హంతకి చలి...
సాక్షి చంద్రుడు...
న్యాయవాది సూర్యుడు...
కేసు దొరికినా సాక్షి దొరకనందుకు
కురకురలాడుతున్నాడు.